మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నివాళి

సరోజనమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

ఆత్మకూర్.ఎస్, జనవరి 13: ఆత్మకూర్.ఎస్ సింగిల్ విండో చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి మాతృమూర్తి సరోజనమ్మ ఇటీవల మృతిచెందారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సోమవారం వారి నివాసానికి వెళ్లి సరోజనమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కృష్ణారెడ్డికి పరామర్శ

ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నంద్యాల కృష్ణారెడ్డిని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తూడి నర్సింహారావు, నాయకులు మర్ల చంద్రారెడ్డి, కసగాని బ్రహ్మంగౌడ్, నెమ్మాది భిక్షం, జీడి భిక్షం, మాజీ ఎంపీటీసీ మిర్యాల వెంకటరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు బొల్ల వెంకటరెడ్డి, గిలకత్తుల సోమయ్య, సోమిరెడ్డి వెంకటరెడ్డి, బెల్లంకొండ యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న యువత

నేరేడుచర్ల, జనవరి 13: స్వామి వివేకానంద జయంతి, సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో పాత నేరేడుచర్ల యూత్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసేమియా బాధిత చిన్నారులకు రక్తం దానం కోసం ఖమ్మం సంకల్ప ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 55 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ ఆర్గనైజర్ దేవిరెడ్డి నాగిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొణతం చిన్నవెంకటరెడ్డి, కౌన్సిలర్ కొదమ గుండ్ల సరిత, నాయకులు సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, బాల వెంకటేశ్వర్లు, తాళ్ల నరేందర్‌రెడ్డి, వాస కరుణాకర్, పల్లయ్య, హుస్సేన్, రవీందర్‌రెడ్డి, సైదిరెడ్డి, కిరణ్, రాము, కార్తీక్, గోపి, సతీశ్, సురేశ్, సాయి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

దుప్పట్లను పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల, జనవరి 13: లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలో నిరుపేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మల్టీజోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్ రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, చార్టర్ ప్రెసిడెంట్ కొణతం సీతారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి గుండ్రెడ్డి సైదిరెడ్డి, కార్యదర్శి షేక్ యూసుఫ్, సభ్యులు గుండా సత్యనారాయణ, కందిబండ శ్రీనివాసరావు, నీలా శ్రీను, భోనగిరి అంజయ్య, విశ్వనాథం, లక్ష్మారెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పెద్దగట్టు ఆలయ కమిటీ నియామకం

చివ్వెంల, జనవరి 13: దురాజ్‌పల్లి లింగమంతులస్వామి (పెద్దగట్టు) ఆలయ కమిటీని నియమించినట్లు నల్లగొండ దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఈ.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేండ్ల కోసారి జరగనున్న పెద్దగట్టు జాతర ఫిబ్రవరి 16వ తేదీ నుంచి 20 వరకు జరగనుంది. ఈ జాతరకు కమిటీ డైరెక్టర్లుగా పోలెబోయిన నర్సయ్య, కుర్రా సైదులు, వీరబోయిన సైదులు, సిరిపంగి సైదమ్మ, మెంతబోయిన లింగస్వామి, మెంతబోయిన చిన్నమల్లయ్య, పోలెబోయిన నరేశ్ పిల్లేను నియమించినట్లు తెలిపారు. వీరు ఏడాది పాటు డైరెక్టర్లుగా కొనసాగుతారని తెలిపారు. గతేడాది ఆగస్టులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నియామకం చేపట్టినట్లు వెల్లడించారు.

చెస్ పోటీల్లో ప్రతిభ

పోటీల్లో గెలుపొందిన దివ్యభవాని, దీక్షిత్

సూర్యాపేట టౌన్, జనవరి 13: ఆంధ్రప్రదేశ్ చదరంగ సమాఖ్య, విజయవాడ చదరంగ సమాఖ్య సంయుక్తంగా ఈ నెల 10వ తేదీ నుంచి 12 వరకు విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన భారతీయ నవీన క్రీడా ఉత్సవ్ బీ అంతర్జాతీయ చదరంగ పోటీల్లో సూర్యాపేట రాడికల్ చెస్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అకాడమీకి చెందిన చంబ్రోలు దివ్యభవాని ఉత్తమ మహిళా క్రీడాకారిణిగా రూ.5,500 నగదు, ట్రోఫీని సాధించింది. మహేశ్వరపు దీక్షిత్ ఉత్తమ క్రీడాకారుడిగా రూ.5 వేల నగదు, ట్రోఫీని గెలుచుకున్నట్లు కోచ్ అనిల్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

యువత అన్ని రంగాల్లో ముందుండాలి : ఎస్ఐ అంతిరెడ్డి

ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ అంతిరెడ్డి

చింతలపాలెం, జనవరి 13: యువత అన్ని రంగాల్లో ముందుండాలని ఎస్ఐ అంతిరెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో జై హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ట్రాక్టర్ రివర్స్, స్లో సైకిల్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ అంతిరెడ్డి హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామస్తులు ఐక్యంగా ఉండి ఇలాంటి పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ట్రాక్టర్ రివర్స్ పోటీల్లో మొదటి బహుమతి పల్లె అంజిరెడ్డి, రెండో బహుమతి షేక్ అల్లాబక్షు, మూడో బహుమతి కారంగుల శ్రీకాంత్, నాలుగో బహుమతి పల్లె నరేందర్ రెడ్డి గెలుచుకున్నారు. అదే విధంగా స్లో సైకిల్ పోటీల్లో కృష్ణారెడ్డి, విక్రమ్, శ్రీనివాస్ వరుసగా మూడు బహుమతులను సాధించారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు జెర్సీలు అందజేత

క్రీడాకారులకు జెర్సీలను అందజేస్తున్న దాతలు

తుంగతుర్తి, జనవరి 13: మండల పరిధిలోని బండరామారం గ్రామంలో రేగటి పద్మ–సోమయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు నరేశ్, సురేశ్ కబడ్డీ, క్రికెట్ క్రీడాకారులకు జెర్సీలు, క్రికెట్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో యామ చంద్రశేఖర్, రేగటి నర్సయ్య, రేగటి రాంబాబు, కర్ల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన భోగి సంబురాలు

సూర్యాపేట టౌన్, జనవరి 14: జిల్లావ్యాప్తంగా సోమవారం భోగి సంబురాలు అంబరాన్నంటాయి. ఉదయాన్నే భోగి మంటలతో పల్లెలు, పట్టణాలు వెలిగిపోయాయి. ప్రజలు ఇళ్లల్లోని పాత వస్తువులను తీసుకెళ్లి భోగి మంటల్లో వేశారు. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా పతంగులు ఎగరేస్తూ సందడి చేశారు. పలువురు తమ ఇళ్లలో బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. మహిళలు ఉదయాన్నే తలంటూ స్నానాలు ఆచరించి ఇండ్ల వాకిళ్లలో రకరకాల ముగ్గులు వేసి రంగులు అద్దారు. ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలు, రేగి పండ్లు, నవ ధాన్యాలు ముగ్గుల్లో ఉంచారు. పిల్లలకు భోగి పండ్లు పోశారు. హరిదాసులు ఇంటింటికీ తిరుగుతూ కీర్తనలు పాడారు. దూడూ బసవన్నలు సందడి చేశారు. జిల్లాకేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో భోగి వేడుకలను నిర్వహించారు.

నేరేడుచర్ల: పట్టణంలోని గ్రంథాలయం వీధిలో ప్రజలు భోగి మంటలు వేసి సందడి చేశారు.

గరిడేపల్లి, జనవరి 13: మండల కేంద్రంలోని శివాలయంలో భక్తులు భోగి మంటలు వేసి భజనలు చేశారు. ఆలయ చైర్మన్ నలజాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: కోదాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వాకర్స్ క్లబ్ సభ్యులు భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఆత్మకూర్.ఎస్: మండలంలోని గట్టికల్లు, తుమ్మల పెన్‌పహాడ్ గ్రామాల్లో క్రీడలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

తిరుమలగిరి: క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మందుల సామేల్ సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. బసవన్నల ఆశీర్వాదం తీసుకున్నారు. సంక్రాంతి అందరరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

కోదాడ టౌన్: కోదాడలోని 34వ వార్డులో కౌన్సిలర్ గంధం యాదగిరి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు బహుమతులను అందజేశారు.

నాగారం: మండలంలోని నాగారం బంగ్లాలో భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారులు ఇండ్ల ముందు అందమైన ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టి పూజలు చేశారు.

చివ్వెంల: మండలంలోని బండమీది చందుపట్ల గ్రామంలో గాయం మంగతాయమ్మ జ్ఞాపకార్థం ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జబర్దస్త్ ప్రోగ్రాం నటుడు రాము చేసిన మిమిక్రీ గ్రామస్తులను ఆకట్టుకుంది. నిర్వాహకులు గాయం చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

మోతె: మండలంలోని సిరికొండ గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి: మండల కేంద్రంలోని బ్రిలియంట్ కాలనీ, పూలగడ్డ బజార్‌లో ఆదర్శ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో భోగి వేడులను ఘనంగా నిర్వహించారు.

సూర్యాపేట టౌన్: భోగి వేడుకల్లో వాసవీ క్లబ్ సభ్యులు

సూర్యాపేటలో..

నేరేడుచర్లలోని గ్రంథాలయం వీధిలో..

నూతనకల్‌లో..

మునగాలలో భోగి మంట వేసిన చిన్నారులు

తుంగతుర్తి: బ్రిలియంట్ కాలనీలో..

గరిడేపల్లిలో..

పాలకవీడులో..

కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

కోదాడ టౌన్: ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ముగ్గులను పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ కవితరాధారెడ్డి

మునగాల, జనవరి 13: సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని నారాయణగూడెం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోదాడ మాజీ ఎంపీపీ చింత కవిత రాధారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..సంక్రాంతి పండుగ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయమని, ఇలాంటి పోటీలను భవిష్యత్తులో కూడా నిర్వహించాలని కోరారు. ఈ ముగ్గుల పోటీల్లో 315 మంది మహిళలు పాల్గొనగా, 1 నుంచి 7 వరకు ప్రధాన బహుమతులు, మిగిలిన వారికి ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గడ్డం లింగయ్య, లక్ష్మీనారాయణ, జమ్మిరెడ్డి, వీరారెడ్డి, చెన్నారెడ్డి, రాంబాబు, వెంకన్న, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సుకింద పడి మహిళకు తీవ్రగాయాలు

కోదాడ టౌన్, జనవరి 13: బస్సుకింద పడి ఓ మహిళకు తీవ్ర గాయాలైన ఘటన కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్డులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌కు చెందిన ఓ మహిళ పని నిమిత్తం ఆర్టీసీ బస్సులో కోదాడకు వచ్చింది. అయితే, బస్సు ఆగకముందే దిగడంతో ఆమె కాలు వెనుక టైర్ కింద పడి నుజ్జునుజ్జయింది. స్థానికుల సమాచారంతో అంబులెన్స్‌లో బాధితురాలిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్ట్

గరిడేపల్లి, జనవరి 13: మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చలికంటి నరేశ్ విలేకరులకు తెలిపారు. సోమవారం ఉదయం కీతవారిగూడెం గ్రామ శివారులో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన కీతవారిగూడెం గ్రామానికి చెందిన దండుగల జాన్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. జనవరి 7వ తేదీన మధ్యాహ్నం కీతవారిగూడెంలో మీ సేవ ముందు ఉంచిన బైక్‌ను దొంగతనం చేసినట్లు విచారణలో ఒప్పుకున్నాడని ఎస్ఐ తెలిపారు. అదే రోజు కోదాడ పట్టణంలో మరో బైక్‌ను దొంగిలించాడని, నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

పబ్లిక్ టాయిలెట్లు లేక అవస్థలు

గరిడేపల్లిలోని ప్రధాన కూడలి

గరిడేపల్లి, జనవరి 13: గరిడేపల్లిలో పబ్లిక్ టాయిలెట్లు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రం కావడంతో నిత్యం వివిధ గ్రామాల ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలతో పాటు వ్యక్తిగత పనుల నిమిత్తం అధిక సంఖ్యలో వస్తుంటారు. అదేవిధంగా నేరేడుచర్ల, హుజూర్‌నగర్, మిర్యాలగూడెం , సూర్యాపేట, కోదాడ ప్రాంతాలకు వెళ్లడానికి గరిడేపల్లి మండల కేంద్రం ప్రధాన కూడలిగా ఉంటుంది. బస్టాండ్ నిరుపయోగంగా ఉండడంతో ప్రధాన రహదారిలో ఆటోలు, బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తుంది. కాగా, పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గరిడేపల్లి సర్కిల్, పోలీస్ స్టేషన్ ఎదురుగా, కల్మల్‌చెరువు రోడ్డులో పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

చిలుకూరు, జనవరి 13: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని ముక్త్యాల కాల్వ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజుర్‌నగర్ పట్టణ పరిధిలోని మాధవరేణిగూడెం గ్రామానికి చెందిన ఆకుల లింగయ్య (55) గ్రామ సమీపంలోని శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ వర్క్స్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకొని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా కోదాడ నుంచి హుజూర్‌నగర్ వెళ్తున్న బైక్ వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. లింగయ్య అల్లుడు కారింగుల జానకీరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సురబి రాంబాబుగౌడ్ తెలిపారు. మతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించనున్నట్లుగా తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

గరిడేపల్లి, జనవరి 13: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. నేరేడుచర్ల మండల కేంద్రంలోని శివాజీ నగర్‌కు చెందిన శోభకు సూర్యాపేటకు చెందిన నందిపాటి రాజుతో 2011వ సంవత్సరంలో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. 2015లో భార్యాభర్తల నడుమ మనస్పర్థలు రావడంతో శోభ ఒంటరిగా నేరేడుచర్లలో ఉంటూ కూలీ పనులకు వెళ్తోంది. ఈ క్రమంలోనే గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామానికి చెందిన మోదుగు మధుతో శోభకు పరిచయం ఏర్పడింది. వారిద్దరూ కలిసి గరిడేపల్లి మండలంలోని ఎల్బీనగర్‌లో గత రెండు నెలలుగా నివాసం ఉంటున్నారు. కాగా, 12వ తేదీ రాత్రి శోభ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ మేరకు సోమవారం శోభ తండ్రి పిడమర్తి వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చలికంటి నరేశ్ తెలిపారు.

'మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి'

నూతనకల్, జనవరి 13: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని మాజీ ఎంపీటీసీ మున్న లక్ష్మీమల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రం నూతనకల్‌లో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతి మహిళకు నెలకు రూ.2,500, కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం, మహిళా సంఘాలకు వడ్డీ లేకుండా రూ.10 లక్షల రుణం ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. హామీలు నేటి వరకు అమలు కాలేదని, ఇకనైనా వాటిపై దృష్టి సారించాలని అన్నారు. మహిళలకు బతుకమ్మ చీరలను కూడా పంపిణీ చేయలేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అమ్మక్క, పుల్లమ్మ, సుమిత్ర, అనిత, మమత తదితరులు పాల్గొన్నారు.

కూతురుతో అసభ్యంగా ప్రవర్తించాడని..

- భర్తను హతమార్చిన భార్యలు

చివ్వెంల, జనవరి 13 : కూతురుతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న భర్తను భార్యలు రోకలి బండతో మోది చంపారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని ఓ ఆవాస తండాలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. తండాకు చెందిన ఆ వ్యక్తి కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు ఇద్దరు భార్యలు. ఇద్దరూ సొంత అక్కాచెల్లెళ్లు. అంతా ఒకే ఇంట్లో ఉంటున్నారు. మెదటి భార్యకు ఇద్దరు కూతుళ్లు, రెండో భార్యకు ఒక కొడుకు ఉన్నారు. కాగా, సదరు వ్యక్తి కూతురుతో అసభ్యంగా ప్రవరిస్తుండడాన్ని భార్యలు గమనించి మందలించారు. అయినా ధోరణి మార్చుకోకపోవడంతో ఆదివారం రాత్రి అతడు నిద్రపోతున్న సమయంలో ఇద్దరు భార్యలు కలిసి రోకలి బండతో మోది, గొంతు నులిమి హత్య చేశారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ రవి, సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ మహేశ్వర్ సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'క్రీడల్లో గెలుపోటములు సహజం'

విజేతలతో నిర్వాహకులు

కోదాడ టౌన్, జనవరి 13: క్రీడల్లో గెలుపోటములు సహజమని కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు అన్నారు. పట్టణ పరిధి కట్టకొమ్ముగూడెం రోడ్డులోని మైదానంలో కత్రం ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కోదాడ నియోజకవర్గస్థాయి ప్రీమియర్ లీగ్– 3 క్రికెట్ పోటీల విజేతలకు కత్రం శ్రీకాంత్‌రెడ్డితో కలిసి సోమవారం బహుమతులను అందజేసి మాట్లాడారు. కోదాడలో స్టేడియం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఐదు రోజుల నిర్వహించిన ఈ ప్రీమియర్ లీగ్‌లో నియోజకవర్గవ్యాప్తంగా మొత్తం 30 జట్లు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినవారికి బహుమతులతో పాటు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సలీంషరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీని చాటుకున్న బేకరీ యజమాని

- కస్టమర్ మర్చిపోయిన ల్యాప్‌టాప్ అప్పగింత

కోదాడ రూరల్, జనవరి 13: కోదాడ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఎ.ఉపేందర్ అనే వ్యక్తి విలాస్ బేకరీ షాపు నిర్వహిస్తున్నాడు. సూర్యాపేటకు చెందిన విజయలక్ష్మి అనే మహిళ సంక్రాంతి పండుగకని ఆదివారం కోదాడకు వచ్చింది. తన పిల్లలతో కలిసి బేకరీలో స్నాక్స్ కొనుగోలు చేసి అక్కడే తన ల్యాప్‌టాప్ బ్యాగును మర్చిపోయింది. యజమాని సాయంత్రం వరకు చూసి ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగును భద్రపరిచాడు. సోమవారం బేకరీకి వచ్చిన బాధితురాలు తన ల్యాప్‌టాప్ ఇక్కడ ఏమైనా ఉందా అని అడిగింది. సీసీ కెమెరాలో చూసి బ్యాగు మర్చిపోయిన మహిళగా నిర్ధారించుకొని అప్పగించాడు.

ఎయిర్‌టెల్ టవర్స్ ఆర్ఆర్‌యూ పరికరాల దొంగ అరెస్ట్

మిర్యాలగూడ రూరల్, జనవరి 13 : ఎయిర్‌టెల్ టవర్స్‌కు చెందిన ఆర్ఆర్‌యూ(రేడియో రిమోట్ యూనిట్) పరికరాలను చోరీ చేసిన దొంగను రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ లోకేశ్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో వివరాలు తెలిపారు. ఈ నెల 4న మండల పరిధిలోని ఐలాపురం శివారులో ఎయిర్‌టెల్ టవర్ నుంచి ఆర్ఆర్‌యూ పరికరాన్ని దొంగిలించినట్లు సెక్యూరిటీ గార్డు ఎండీ యాకూబ్ పాషా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సోమవారం కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై వెంకటాద్రి పాలెం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మండల పరిధిలోని ధీరావత్ తండాకు చెందిన ధీరావత్ నవీన్(పాత నేరస్తుడు) బైకుపై వెళ్తుండగా పట్టుకొని విచారించగా నేరాలను అంగీకరించాడు. ఐలాపురం, శ్రీనివాస్‌నగర్, నందిపహాడ్ శివార్లలో ఎయిర్‌టెల్ టవర్స్ నుంచి ఆర్ఆర్‌యూ పరికరాలను తనతో పాటు పెన్‌పహాడ్ మండలం ధర్మపురం తండాకు చెందిన లకావత్ వెంకన్న కలిసి చోరీ చేసినట్లు తెలిపారు. దొంగిలించిన రూ.2.50లక్షల విలువైన ఆర్ఆర్‌యూ రెండు పరికరాలను శ్రీవాస్‌నగర్ సమీపంలో దాచినట్లు తెలిపారు. నిందితుడి నుంచి రెండు ఆర్ఆర్‌యూ పరికరాలు, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నామని, మిర్యాలగూడ న్యాయస్థానంలో హాజరు పరిచామని, మరో నిందితుడు వెంకన్న పరారీలో ఉన్నాడని ఎస్ఐ తెలిపారు.

ఉర్సుకు పటిష్ట భద్రత : సీఐ

పాలకవీడు, జనవరి 13: ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు హుజుర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీనారాయణ, దర్గా అధికారి మహమూద్, ముజావర్ జానీ తదితరులు పాల్గొన్నారు.